క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ జయంతి



చెరుకుపల్లి: శ్రీ మహాలక్ష్మీ దేవి స్వరూపిణి అనఘాదేవి దత్త స్వామికి పూజలు నిర్వహించటం ద్వారా సకల సంపదలు ప్రాప్తిస్తాయని విజయవాడ వేద పండితులు బెల్లంకొండ మురళీకృష్ణమాచారి అన్నారు. చెరుకుపల్లి వీర రాఘవపేటలో వేంచేసియున్న శ్రీ షిరిడీ సాయిబాబ మందిరంలో దత్త జయంతి వేడుకలు శాస్త్రోక్తంగా ఆదివారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కొందరు దంపతులు హోమగుండ పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పెద్ద సంఖ్యలో సామూహికంగా అనఘాదేవి ఆరాధన, వ్రత కార్యక్రమం నిర్వహించారు. అనఘా వ్రతం చేయటం ద్వారా సుఖ సంతోషాలతో జీవించటంతో పాటు ఆర్థిక పరిపుష్టి కలుగుతుందని భక్తుల నమ్మకం. భక్తులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో విజయవాడకు చెందిన వేద పండితులు బెల్లంకొండ మురళీ కృష్ణమాచారి, ఆలయ అర్చకులు మల్లెల కృష్ణమూర్తి, ఆలయ అధ్యక్షుడు రావూరి ఆంజనేయులు, కార్యదర్శి దివి రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు దుస్తులు పంపిణీ




చెరుకుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద వృద్ధులు, చిన్నారులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెరుకుపల్లి న్యూ లైఫ్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండాల రవి పేర్కొన్నారు. క్రిస్మస్ పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో 50 మంది చిన్నారులకు న్యూ లైఫ్ ఫౌండేషన్ తరపున ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. సందర్భంగా రవి మాట్లాడుతూ ఈ ఫౌండేషన్‌ను గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు సేవలు చేసేందుకే స్థాపించామని, మొదటి సంవత్సరం చిన్నారులకు బట్టల పంపిణీ కార్యక్రమం చేశామన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ట్రెజరర్ జి.మోహన్, గుండాల దానియేల్, ఊసరపు నాంచారయ్య, గ్రామ పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కొల్లూరు : ప్రజలకు వైద్య సేవలు అందజేయడానికి ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని జువ్వలపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో ఎన్‌ఆర్‌ఐ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 1100 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి రూ.3.50 లక్షల విలువైన మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వీరిలో 110 మందికి ఎకో పరీక్షలు, 300 మందికి రక్త పరీక్షలు, 50 మందికి అల్ట్రాసౌండ్ పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. జార్ఖండ్ మాజీ డీజీపీ, ఎన్‌ఆర్‌ఐ అకాడమీ ఆఫ్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ వి.వెంకటేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్ జి.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ శివ్‌ప్రోబిద్, రేడియాలజీ హెచ్ఓడీ అనకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ 1988–89 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కుటుంబ సభ్యులతో సహా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలు, హైస్కూల్‌లో గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. 2018లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుని ప్రతి ఏటా పూర్వ విద్యార్థుల వార్షికోత్సవం నిర్వహించుకోవడం ఎక్కడా లేదని, అటువంటి ఘనత మన బ్యాచ్‌కే దక్కిందని ఈ బృహత్తర కార్యక్రమం భవిష్యత్తులో మిగతా వారికి ఆదర్శంగా ఉంటుందని భావిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. అంతకు ముందు మృతి చెందిన తోటి మిత్రులకు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో భాగంగా తొలుత అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేట సాగేనా..!?

- వాతావరణ మార్పులతో మత్స్యకారులకు తప్పని ఇబ్బందులు
- మరో నెల రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని వాపోతున్న మత్స్యకారులు
- సుదూర వేట సాగించినా ఫలితం శూన్యం
- బోట్లకు ఆయిల్ ఖర్చు కూడా రాని వైనం



వేటకు వెళ్లకుండా తీరంలో నిలిపి ఉంచిన పడవలు

బాపట్ల: వాతావరణంలో మార్పు కారణంగా సముద్రంలో వేట సాగించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సముద్రంలో సుదూర ప్రాంతం వేటకు వెళ్లినప్పటికీ వాతావరణ మార్పు కారణంగా చేపలు పడకపోవటంతో మత్స్యకారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వరుసగా అల్పపీడన ద్రోణి కొనసాగటం అయినా వర్షాలు కురవకపోవటంతో మత్స్యకారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

మరో నెల రోజులు వేట సరిగా ఉండదు

సాధారణంగా వేట నిషేధం సందర్భంగా మే నెల నుంచి 45 రోజులు వేట ఉండకపోవటంతో ఆ తరువాత వేట సజావుగా సాగుతుంది. వరుసగా ఏర్పడుతున్న అల్పపీడన ద్రోణులతో ప్రస్తుతం వేట సాగటం ఇబ్బందికరంగా మారింది. దీంతో మత్స్యకారులు సముద్రంలో చాలా దూరం వెళ్లి వేట సాగిస్తున్నారు. అయినప్పటికీ డీజిల్‌కు సరిపడే విధంగా కూడా మత్స్య సంపద పడటం లేదు. ఇదే పరిస్థితి మరో నెలరోజులు పాటు కొనసాగే అవకాశం ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పెరిగిన గిరాకీ

అల్పపీడనం కారణంగా వేటకు వెళ్లకపోవటంతో కాలువలో దొరికే చేపలకు భారీ డిమాండ్ వచ్చి పడింది. ధరలో కూడా భారీగా మార్పు కనిపిస్తోంది. పండు చేప, మెయ్యలు, గొరకలు, చందవాలు, మత్స్య, జల్లలు పడుతున్నాయి. పండు చేపలు కేజీ రూ.550 వరకు ఉండగా మిగిలినవి రూ.200 నుంచి రూ.250 వరకు ధర పలుకుతున్నాయి.



చేపల కోసం వలలో చూసుకుంటున్న మత్స్యకారులు

వేట సాగటం లేదు



వేట సాగకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అల్పపీడనం వలన సముద్రంలో కూడా అలలు పడుతున్నాయి. ఈ అలలు ఉధృతంగా రావటంతో చేపలు కూడా పడటం లేదు. ఈ ప్రభావంతో మరో నెల రోజులు పాటు వేటకు వెళ్లే అవకాశం కనిపించటం లేదు. – సంగాని బాలచంద్రం, మత్స్యకారుడు

దూరం వెళ్లినా చేపలు పడటం లేదు



సముద్రంలో ఎంత దూరం వేటకు వెళ్లినప్పటికీ చేపలు పడటం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కనీసం బోట్లకు ఆయిల్ ఖర్చు కూడా రావటం లేదు. వేటకు ప్రకృతి సహకరించటం లేదు. మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
– కొక్కిలిగడ్డ చెంచయ్య, మత్స్యకారుడు

21న పలు సేవా కార్యక్రమాలు

రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



రేపల్లె రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌ సీపీ వ్యవస్థాపకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీన రేపల్లె నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ తెలిపారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. సేవా కార్యక్రమాలలో భాగంగా కార్యాలయాల్లో కేక్ కటింగ్, అన్నదానంతో పాటు మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానంగా నిలుస్తుందని చెప్పారు. అధినేత జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతు సమస్యలపై జిల్లా కేంద్రమైన బాపట్లలో అన్నదాతకు అండగా నిర్వహించిన నిరసన కార్యక్రమం విజయవంతమైందని డాక్టర్ గణేష్ చెప్పారు. రైతు సమస్యలపై నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా నలుమూలలతో పాటు రేపల్లె నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తరలిరావటం ఆనందంగా ఉందన్నారు. నిరసన కార్యక్రమానికి తరలిచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ కమిటీలు వైఎస్సార్ సీపీ గెలుపుకు పునాదులు

వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

వేమూరు: వైఎస్సార్‌సీపీ గెలుపుకు గ్రామ పార్టీల కమిటీలు పునాదులని నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండలంలోని వామనగుంట పాలెంలో వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ కార్యవర్గం ఏర్పాటు చేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా ఓలేటి శ్రీనాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేడు వరికూటి అశోక్‌బాబు జన్మదినం సందర్భంగా ఆదివారం కేక్ కట్ చేసి ముందస్తు శుభాకాంక్షలు గ్రామస్తులు తెలిపారు. అశోక్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వల్ల ప్రతి కుటుంబం నష్టపోయిందన్నారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేస్తామని చెప్పి, అధికారం చేపట్టిన తర్వాత మొండి చెయ్యి చూపించారన్నారు. ఆరు నెలలయినా తల్లికి వందనం పథకం గురించి పట్టించుకోవడం లేదన్నారు. రైతుల ఆశలను గాలికి వదలేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్నెపూడి క్రాంతి కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస వ్రతం

జంపని(వేమూరు): చెన్నకేశవస్వామి వారి దేవస్థానంలో వార్షిక ధనుర్మాస వ్రత పూజ కైంకర్యాదులు తెల్లవారుజాము నుంచి ప్రారంభించడం జరుగుతుందని అర్చకులు శ్రీనివాస మూర్తి తెలిపారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భూ సహిత చెన్నకేశవస్వామి దేవస్థానంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ధనుర్మాస వ్రత పూజ పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. స్వామి వారికి, గోదాదేవికి సుప్రభాత సేవ అనంతరం సహస్ర అష్టోత్తర శతనామ పూజ, కుంకుమార్చన తదుపరి తిరుప్పావై, మంగళాష్టకాల పఠనం, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. భోగి పండగ రోజు వరకు నిత్యం జరిగే భగవదారాధనలో భక్తులు పాల్గొని చెన్నకేశవస్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య పరిరక్షణకు కృషి చేయాలి

మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు

రేపల్లె రూరల్: పట్టణంలో పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు అన్నారు. పట్టణంలోని 28వ వార్డు పేటేరు రహదారిలో రహదారికి ఇరువైపుల ఉన్న పిచ్చిచెట్లు, పెంటపోగులను ఆదివారం తొలగించి అనంతరం మాట్లాడారు. గృహాల నుంచి వచ్చే వ్యర్థాలను నిర్దేశిత ప్రదేశాలలో వేయడం గానీ, పారిశుద్ధ్య సిబ్బందికి అందించడం గానీ చేయాలన్నారు. రహదారుల పక్కన, జన సంచారం ఉన్న ప్రాంతాలలో పడవేసి పరిశుభ్రతకు ఆటంకం కలిగించరాదని చెప్పారు. పేటేరు రహదారిలో రహదారి పక్కనే వ్యర్థాలను వేయటంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రం నెలకొనటంతో ప్రత్యేక డ్రైవ్ ద్వారా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. ఈ ప్రాంతంలో ఎవరైనా పారిశుద్ధ్యానికి విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీ సురేంద్ర, మేస్త్రి రాజమోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



28వ వార్డులో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

వేల్ ధరించిన అయ్యప్ప మాలధారులు

రేపల్లె రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పంచ మండపాల పడిపూజ, వేల్‌పూజ కార్యక్రమాలు శనివారం రాత్రి వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణం స్వామియే.. శరణం అయ్యప్ప అంటూ మార్మోగింది. ఆలయంలో అరటి మట్టలతో పంచ మండపాలను ఏర్పాటు చేసి అయ్యప్పస్వామిని నెలకొల్పి ఆలపాటి రామకృష్ణగురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామికి పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్ప మాలధారులు, భక్తులు భజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. తొలుత ఓల్డ్ టౌన్‌లోని బాలాత్రిపుర సుందరీ సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్పస్వామిని ప్రత్యేక వాహనంలో నెలకొల్పి అయ్యప్ప, భవానీ మాలధారులు వేల్ ధరించి పురవీధుల్లో ఊరేగింపుగా అయ్యప్ప నామస్మరణ చేస్తూ స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.





పంచ మండపాల పూజలు నిర్వహిస్తున్న రామకృష్ణ గురుస్వామి
అయ్యప్పస్వామి (ఇన్‌సెట్లో)



భజన చేస్తున్న అయ్యప్ప మాలధారులు, భక్తులు



వేల్ ధరించి ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

శబరిమలకు మాలధారులు

ఇసుకపల్లి చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో గురుస్వామి గోగినేని గోపాలరావు ఆధ్వర్యంలో రఘు గురుస్వామి బృందంచే ఆదివారం ఇరుముడి కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా 11 మంది కన్నె స్వాములతో పాటు 38 మంది అయ్యప్ప దీక్షాపరులు ఇరుముడి ధరించి శబరిమల పయనమయ్యారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

వాడవాడలా ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి

రేపల్లె రూరల్: ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని ఆర్యవైశ్య సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు తూనుగుంట్ల శ్రీనివాసరావు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణ ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ బాటలోనే శాంతియుతంగా ఆమరణ నిరాహార దీక్ష చేసి శ్రీరాములు రాష్ట్రాన్ని సాధించారన్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ, కొణిజేటి రోశయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాళేపల్లి ఈశ్వరబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కౌన్సిలర్ బొలిశెట్టి సత్యనారాయణ, మహిళా సంఘం అధ్యక్షురాలు బొలిశెట్టి లక్ష్మీతాయారు, ఆర్యవైశ్య నాయకులు మట్టుపల్లి సుబ్బారావు, పొన్నూరు మల్లికార్జునరావు, తూనుగుంట్ల రాజేష్, తడికమళ్ళ బాబు, సుగ్గుల సుదర్శన్, మద్ది బదరీ నారాయణమూర్తి, నంబూరు సత్యప్రసాద్, కే మహేష్ పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ కాకర్ల సాంబశివరావు, మున్సిపల్ కౌన్సిలర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా బీజేపీ నాయకులు అన్నం సాయివరప్రసాద్, పిన్ని సాంబశివరావు, శివరామ్ ప్రసాద్, సురేష్ తదితరులు ఓల్డ్ టౌన్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రేపల్లెలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

నగరంలో...

నగరం: పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం మండల కేంద్రమైన నగరంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పెనుగొండ వెంకటకృష్ణారావు, తాండవ కృష్ణ, వెంకట సురేష్‌బాబు, బాలగోపాల్, నవీన్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకి నివాళి

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాముల త్యాగనిరతిని తెలుగువారందరూ భావితరాలకు వివరించాలని పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావు చెప్పారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ మెంబర్ బేతాళం సుబ్బరాజు, పాఠకులు దండు సోమరాజు, సూర్యనారాయణ రాజు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



నగరంలో పొట్టి శ్రీరాముల నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



రేపల్లె మున్సిపల్ కార్యాలయంలో...



పిట్టలవానిపాలెం గ్రంథాలయంలో...

మహానుభావుల త్యాగాలు మరువలేనివి

డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: ఆంధ్రరాష్ట్ర సాధనకు అమరుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. ఆదివారం గుళ్ళపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వర్ధంతి సభ డాక్టర్ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత డాక్టర్ ఈవూరి గణేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ పటేల్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. గణేష్ మట్లాడుతూ తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం నిరుపమానమైనదన్నారు. అదే విధంగా సర్దార్ పటేల్ దేశాన్ని సమైక్యంగా ఉంచేందుకు చేసిన కృషి మరువలేమన్నారు. చెరుకుపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి, సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో వైసీపీ నాయకులు దుండి వెంకట రామిరెడ్డి, వంగరు వెంకటేశ్వరరావు, కాసీ ప్రభాకర్, జాలాది ఇస్సాక్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని, ఈవోపీఆర్డీ కేజీఏ శ్రీనివాసన్, పోలీస్ సిబ్బంది, ఆర్యవైశ్య నాయకులు విస్సంశెట్టి శ్రీనివాసరావు, నాగమధు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు, సర్దార్ పటేల్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న డాక్టర్ గణేష్

పొట్టి శ్రీరాములు ఆశయాలను ముందుకు తీసుకుపోదాం

ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు



బాపట్ల: తెలుగువారి ఆత్మగౌరవం కోసం అనునిత్యం కృషి చేసి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు ఆశయాలను భావితరాలు గుర్తుంచుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు సూచించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక ఏరియా వైద్యశాల వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా రామయ్య, జోగి రాజా, కటికల యోహోషువా, నాగవరపు కృష్ణమూర్తి, యారం కైలాస్, మార్పు లక్ష్మణ్, జంపాని శ్రీనివాసరావు, జోగి యేసు రాజు తదితరులు ఉన్నారు.

క్రీస్తు లూథరన్ దేవాలయంలో క్యాలెండర్ ఆవిష్కరణ

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఆదివారం జరిగిన ఆరాధన మహోత్సవంలో భాగంగా 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ సంఘ పెద్దల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్లను దివంగత ఉపాధ్యాయులు కూచిపూడి వెంకయ్య, మరియమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్యారిష్ డెలిగేట్, పీసీసీ, పెద్దలు, స్త్రీల సమాజం, యూత్, చిల్డ్రన్స్, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.



బస్టాండ్ సెంటర్‌లో మరుగుదొడ్ల ఏర్పాటు



భట్టిప్రోలు: భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ (బీఎఫ్ఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా బస్టాండ్ సెంటర్‌లో మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఈ నేపథ్యంలో ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన బీఎఫ్ఏ ముందుకు వచ్చి మరుగుదొడ్లను రూ.4 లక్షల వ్యయంతో నిర్మాణం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిర్మాణం పూర్తయిన తరువాత గ్రామ పంచాయతీకి అప్పగించనున్నారు. దీంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగనున్నాయి.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు



పేరలి(కర్లపాలెం): గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటం అభినందనీయమని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ చెప్పారు. డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం పేరలి గ్రామంలో పేరలి నరసయ్య, మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, తిమ్మరాజు కృష్ణమూర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో బాపట్ల ఎకో హాస్పిటల్ డాక్టర్ శరత్‌బోస్, ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు అన్వర్‌లు సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలకృష్ణమూర్తి, భూపతిరావు, రమేష్, బొమ్మనబోయిన సాంబయ్య, తిరుపతిరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.